

సాక్షిగణపతికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణార్థం శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం. ఆలయప్రాంగణంలోని జ్వాలా వీర భద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్:శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం గుజరాత్‌కు చెందిన విశ్వంభర కుటుంబం రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.22
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 80.124
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,893
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 8,658

న్యూస్‌రీల్

నంద్యాలను నేరరహిత పట్టణంగా మారుద్దాం



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి, నంద్యాలను నేరరహిత పట్టణంగా తీర్చి దిద్దుదామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను డీఎస్పీ యుగంధర్‌బాబును అడిగి తెలుసుకున్నారు. మట్కా, గ్యాంబ్లింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎంతటి వారైనా వదలొద్దని సూచించారు. బీఎన్‌ఎస్ చట్టాలపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. రౌడీషీటర్లకు, పాతనేరస్తులకు ప్రతి ఆదివారం కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. రాత్రి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట సీసీ నాగరాజు ఉన్నారు.

సివిల్ సప్లై గోదాము తనిఖీ



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని సివిల్ సప్లై గోదామును జేసీ విష్ణుచరణ్ బుధవారం తనిఖీ చేశారు. గోదాములో ఉన్న సరుకులతోపాటు రికార్డులను పరిశీలించారు. డిపోలకు సకాలంలో రేషన్ సరుకులు పంపిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సరుకుల తూకాల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని అక్కడి రికార్డుల గదిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రత్నకుమారి ఉన్నారు.


అధికారులపై సస్పెన్షన్ వేటు

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో న్యాయశాఖ మంత్రి ఫరూక్ స్థలాన్ని ఇతరుల పేరు మీద వేకెంట్ ల్యాండ్ పన్ను విధించిన విషయంలో పలువురు అధికారులపై బుధవారం సస్పెన్షన్ వేటు పడింది. కోర్టు పరిధిలో ఉన్న స్థలానికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించిన విషయంలో నంద్యాల మున్సిపల్ ఇన్‌చార్జ్ ఆర్‌ఓ వెంకటకృష్ణ, ఆర్‌ఐ గులాం హుస్సేన్‌లతో పాటు 35వ వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ సుధాకర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంపై పన్ను విధించడానికి భారీ ఎత్తున సొమ్ము చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వీరిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు రూ.59,60,91,081 విడుదలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని 482 పంచాయతీలకు రూ.31,56,17,649 విడుదల కాగా, ఇందులో బేసిక్ గ్రాంట్ కింద రూ.12,62,46,967, టైడ్ గ్రాంట్ కింద రూ.18,93,70,682 కేటాయించారన్నారు. నంద్యాల జిల్లాలోని 488 పంచాయతీలకు రూ.28,04,73,432 మంజూరు కాగా, ఇందులో బేసిక్ గ్రాంట్ కింద రూ.11,21,89,293, టైడ్ గ్రాంట్ కింద రూ.16,82,84,139 మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్‌మిత్రల (పారిశుద్ధ్య కార్మికులు) వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆదేశించారు. అలాగే తాగునీటి సదుపాయం, వీధి లైట్ల ఏర్పాటుకుప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ధరల వాత



కొండెక్కిన నిత్యావసరాలు

- బెంబేలెత్తుతున్న సామన్య, మధ్యతరగతి ప్రజలు
- బియ్యం, పప్పులు, ఉల్లి, వెల్లుల్లి ధరలకు రెక్కలు
- జూన్ 4వ తేదీతో పోలిస్తే అదుపులేకుండా పెరుగుదల
- అధికారుల సమాచారం మేరకే కంది పప్పు కిలో ధర రూ.181
- ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.160 ప్రకారం అమ్మకాలు
- చిరుద్యోగుల నెలవారీ బడ్జెట్ తలకిందులు
- సంక్షేమ పథకాల నిలుపుదలతో పెను ప్రభావం

నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోయాయని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు గగ్గోలు పెట్టారు. ఇందుకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమని నిందలేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని ఉచిత హామీలిచ్చారు. అమలుకు సాధ్యం కాని ఇలాంటి ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చిన ఆయన ఇప్పుడు ఆ ఊసే మరిచారు. ఎన్నికలు ముగిసిన రెండు నెలల కాలంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. ధరల నియంత్రణ దేవుడెరుగు.. ముట్టుకుంటే మండిపోయే నిత్యావసరాలతో నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలు బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. సామాన్యుల నెలవారీ బడ్జెట్ తలకిందులైన పరిస్థితుల్లోనూ ఆదుకుంటామన్న ప్రభుత్వం ఆ దిశగా మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం.



సి.క్యాంపు రైతుబజారులో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటరు

కర్నూలు(అగ్రికల్చర్): నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. 2019–20 నుంచి 2023–24 వరకు అధికారంలో ఉన్న వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటి, రెండు సంక్షేమ పథకాల నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా విడుదల చేయడం ప్రజల కొనుగోలు శక్తిని పెంచింది. అప్పట్లో ధరలు కూడా అదుపులో ఉండటం వల్ల సామాన్యుల జీవనానికి భరోసా దక్కింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సంక్షేమ పథకాల ఊసే లేకుండాపోయింది. టీడీపీ–జనసేన పార్టీ నేతలు ఎన్నికల సమయంలో సూపర్–6 పేరిట, మేనిఫెస్టో ముసుగులో అరచేతిలో వైకుంఠం చూపించారు. అధికారం చేపట్టిన తర్వాత హామీల మాటే మరిచారు. తాము పనిచేయడం మాని, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతోనే సరిపెడుతుండటం గమనార్హం. రెండు నెలలు గడిచిపోయినా ఇప్పటి వరకు పింఛను పెంపు మినహా ఏ ఒక్క హామీని అమలు చేయకపోయారు. సంక్షేమ పథకాలు దూరం కావడంతో ప్రజల చేతిలో పైసా లేని పరిస్థితి. ఇదే సమయంలో ధరలు కూడా అడ్డగోలుగా పెరగడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం.

జూన్ 4తో పోలిస్తే నిత్యావసరాల ధరల్లో భారీ పెరుగుదల

నిత్యావసరాల ధరలు భారీగా పెరుగుతున్నాయనేందుకు జిల్లా యంత్రాంగం ప్రతి 15 రోజులకు పంపుతున్న నివేదికనే నిదర్శనం. జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి పంపిన నివేదిక ప్రకారమే జూన్ 4వ తేదీతో పోలిస్తే.. ప్రస్తుతం అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినట్లు స్పష్టమవుతోంది. రెండున్నర నెలల వ్యవధిలోనే ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ధరలు నిలకడగా ఉన్నప్పటికీ.. అప్పట్లో టీడీపీ, జనసేన పార్టీలో అడ్డగోలు విమర్శలు చేసి పబ్బం గడుపుకున్నాయి. అయితే ఇప్పుడు 10 నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగినా కూటమి నేతలు నోరు మెదపకపోవడం గమనార్హం. ధరల పెరుగుదల వల్ల ప్రతి కుటుంబంపై నెలకు రూ.3వేలనుంచి రూ.5వేల వరకు భారం పడుతోంది. మార్కెట్‌లో వ్యాపారులు కూడా కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది.

చిరుద్యోగుల పరిస్థితి మరీ దారుణం

ధరల పెరుగుదల కారణంగా చిరుద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వేతనాలు రూ.20వేలలోపే ఉండటం, ధరలు అడ్డగోలుగా పెరుగుతుండటంతో ఖర్చులను తట్టుకునేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో అవుట్‌సోర్సింగ్‌పై దాదాపు 3వేల మంది వరకు పని చేస్తున్నారు. వీరి వేతనాలు రూ.20వేల లోపే. నెల ఖర్చులు మాత్రం రూ.24 వేల వరకు ఉంటున్నాయి. అంటే ప్రతి నెల రూ.5 వేల వరకు అప్పులు చేయక తప్పని పరిస్థితి.

సంపాదన రూ.20 వేలు.. ఖర్చు రూ.24 వేలు



మేము ఆరుగురు కుటుంబ సభ్యులం. నాకు, నా భర్తకు కలిపి నెలకు రూ.20వేల వరకు ఆదాయం ఉంటుంది. నెల ఖర్చులు లెక్కేస్తే రూ.24వేల వరకు అవుతుంది. ఇందుకు పెరిగిన నిత్యావసరాల ధరలే కారణం. మాలాంటి నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలు ఎలా బతకాలి. గత మే నెలలో రూ.18వేల వరకు అయ్యే ఖర్చు ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పినట్లు ధరలను నియంత్రించాలి.

– విజయలక్ష్మి, పెద్దపాడు, కల్లూరు మండలం

పచ్చడి మెతుకులే దిక్కు



మా ఇంట్లో ఐదుగురం ఉంటాం. నా రెక్కల కష్టం మీదే బతుకుతున్నాం. రెండు ఎకరాల భూమి ఉన్నా వర్షాధారం సాగుతో పెట్టుబడి కూడా చేతికందదు. రోజు కూలీకి పోతే రూ.300 వస్తుంది. నెలకు రూ.9వేల వరకు సంపాదిస్తున్నా ఖర్చులు రూ.12వేల వరకు అయితుంది. పెరిగిన ధరలే ఇందుకు కారణం. అందుకే అప్పుడప్పుడు పచ్చడి మెతుకులతో సరిపెట్టుకుంటున్నాం. టీడీపీ నాయకులు చెప్పేది ఒకటి చేసేది ఒకటి. – జి.చిట్టెమ్మ, చౌట్కూరు గ్రామం, మిడుతూరు మండలం

మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం ధరలు భారీగా పెరిగినట్లు అధికార యంత్రాంగమే అంగీకరిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక కౌంటర్ల ద్వారా మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు అమ్మించే ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటర్ల దగ్గర కందిపప్పు, బియ్యం ధరలపై ఫ్లెక్సీలు కూడా పెట్టించారు. ఈ ఫ్లెక్సీలను చూస్తేనే ధరలు ఈ విధంగా పెరిగాయా అనిపించక మానదు. అధికారుల కథనం ప్రకారం కిలో కందిపప్పు(దేశవాళీ) రూ.181 ఉంది. రైతుబజార్లలో రూ.160 ప్రకారం విక్రయిస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన కౌంటర్లలో తక్కువ ధర అంటూ రూ.150 ప్రకారం పంపిణీ చేస్తున్నారు. జూన్ 4న కందిపప్పు ధర కేవలం రూ.115 మాత్రమే ఉంది. అంటే కిలోపై రెండున్నర నెలల వ్యవధిలోనే రూ.66 పెరగడం గమనార్హం. ఇక బియ్యం, కందిపప్పు, ఉల్లి, వెల్లుల్లి, ఇలా అన్ని రకాల నిత్యావసరాల ధరలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి.



కందిపప్పు కిలో ధర రూ.181 ఉన్నట్లు జిల్లా యంత్రాంగం పెట్టిన ఫ్లెక్సీ

మధ్య తరగతి, చిరుద్యోగుల నెలవారీ ఖర్చులు ఇలా..

సరుకులు	ఖర్చు (రూపాయల్లో)
బియ్యం(25 కిలోలు)	1,500
గ్యాస్	1,000
కూరగాయలు	1,000
నెల సరుకులు	5,000
చికెన్(4 సార్లు)	1,000
ఫోన్ రీచార్జి(2 ఫోన్లు)	700
మెడికల్ ఖర్చులు	3,000
వినోదం	2,000
పెట్రోలు	2,000
కరెంటు బిల్లు	1,000
ఇతర ఖర్చులు	750
ఇంటి అద్దె	6,000
మొత్తం ఖర్చు	24,950

జూన్ 4వ తేదీతో పోలిస్తే నిత్యావసర సరుకుల కిలో ధర ఇలా..

సరుకు	జూన్ 4న	ఆగస్టు 19న (రూపాయల్లో)
కందిపప్పు	115	181
బియ్యం పాతవి	58	62
చక్కెర	40	44
మినపప్పు	95	120
శనగపప్పు	63	95
పెసరపప్పు	95	116
ఎండుమిర్చి	180	200
జొన్నలు	48	55
వెల్లుల్లి	160	250
ఉల్లిగడ్డలు	25	46
బెల్లం	56	60

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి



అధికారులతో మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

- ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: భారీ వర్షాల కారణంగా శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు, స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం దేవస్థాన అధికారులతో కలిసి క్షేత్రంలోని పలుచోట్ల పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. పుష్కరిణి, ఉత్తర మాడవీధి, ఇంజినీరింగ్ స్టోర్ పరిసరాలు, పాతాళగంగ మార్గం, శివసేవకుల వసతి డార్మెటరీలు, కల్యాణకట్ట, శివసదనం, పెద్ద సత్రం కూడళ్ల తదితర ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. వర్షాలు కురుస్తుండటంతో తాగు నీరు కలుషితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రహదారులు జలమయం కావడంతో మ్యాన్ హోళ్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఇళ్లలోకి నీరు చేరిన కారణంగా వంట చేసుకునే అవకాశం లేని స్థానికులకు అన్నప్రసాద వితరణలో భోజనప్రసాదాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యాత్రికులకు దేవస్థానం డార్మిటరీలలో ఉచిత వసతిని కల్పించాలన్నారు. ఉచిత వసతి కల్పన గురించి యాత్రికులకు తెలిసే విధంగా దేవస్థాన ప్రసార వ్యవస్థ ద్వారా నిరంతరం సూచనలు చేయాలన్నారు. క్షేత్ర పరిధిలో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. సమీక్షలో దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణధికారి రమణమ్మ, ఈఈలు రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, ఏఈఓలు ఫణిధరప్రసాద్, స్వాములు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

వెజి ‘ట్రబుల్’ బిర్యానీ

- కూరగాయలు లేకుండానే బిర్యానీ వండిన వంట నిర్వాహకురాలు
- నీళ్ల చారును తలపించిన ఆలూ కుర్మా



మందలూరు ఎంపీపీ పాఠశాలలో కూరగాయలు లేని బిర్యానీ తింటున్న విద్యార్థులు

సాక్షి విజిట్

వెజిటబుల్ బిర్యానీలో విజిటబుల్స్ లేవు.. ఆలూ కుర్మాలో ఆలూ లేదు.. రంగు కలిపిన అన్నం, నీళ్ల చారును తలపించే కుర్మాను రుద్రవరం మండలం మందలూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు బుధవారం మధ్యాహ్నం వడ్డించిన భోజనం. గత ఐదేళ్లు జగనన్న గోరు ముద్ద పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందింది. రోజుకో వంటకం వండి విద్యార్థులకు వడ్డించే వారు. వాటితో పాటూ గుడ్డూ, చిక్కీలు, రాగి జావాతో ఇంటి భోజనాన్ని మరిపించేలా ఉండేది. కానీ కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థుల నోటికాడి కూడులోనూ రాజకీయం చోటుచేసుకుంది. వంట ఏజెన్సీలను మార్చి తమ అనుంగులకు కట్టబట్టడంతో వాళ్ల మెనూకు మంగళం పాడుతున్నారు. వెజిటబుల్ బిర్యానీలో వెజిటబుల్స్ ఉండవు. ఆలూ కుర్మాలోనూ ఒకటో అరో ఆలూ వేసి నీళ్లచారుతో సరిపెడుతున్నారు. మందలూరు ఎంపీపీ పాఠశాలను బుధవారం ‘సాక్షి’ విజిట్ చేయగా పలు విషయాలు వెలుగు చూశాయి. పాఠశాలలో 11 మంది విద్యార్థులున్నారు. అందులో 9 మంది హాజరయ్యారు. మెనూ ప్రకారం విజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా చేయాల్సి ఉంది. సాధారణంగా మంది ఎక్కువ ఉంటే భోజనం సరిగా కుదురుకోకపోవచ్చు. కానీ పట్టుమని పది మంది కూడా లేరు. తగినంత ఉప్పు, కారంతోపాటు కాసిన్ని కూరగాయలు వేసి చేస్తే రుచి అద్భుతంగా ఉంటుంది. ఇక్కడి వంట నిర్వాహకురాలు ఆ తొమ్మిది మందికి కూడా రుచీపచీ లేని భోజనం వండి పెట్టారు. కూరగాయలు వేయకుండా అన్నంలో రంగు పొడి వేసి అదే బిర్యానీలా తయారు చేసింది. ఇక ఆలూ కుర్మా కూడా నీళ్ల చారును తలపించింది. పర్యవేక్షించాల్సిన అక్కడి ఉపాధ్యాయుడు రవికుమార్ గుప్తా కూడా తనకెందుకులే అనుకున్నారో ఏమో ఫొటోలు తీసి అంతా బాగున్నట్లు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కానీ విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడ్డారు. ఇదే విషయాన్ని ఎంఈఓ కోటయ్య దృష్టికి తీసుకెళ్లగా విచారించానని, మరోసారి ఇలా జరిగితే చర్యలు తీసుకుంటానని చెప్పారు.

– రుద్రవరం

జొన్న సాగు కలిసొచ్చేనా..?

- గత ఏడాది వెంటాడిన వర్షాభావం
- మద్దతు ధరతో గట్టెక్కిన రైతన్న
- ఈనెలాఖరు నుంచి సాగుకు అదును
- హైబ్రిడ్, మహేంద్ర రకాల సాగుపై ఆశలు

కోవెలకుంట్ల: ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో చివరి పంటగా రైతులు జొన్న సాగుపై ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టాలు చవి చూశారు. ఈ ఏడాది విత్తనానికి ముందే వాతావరణం అనుకూలంగా మారటంతో కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఏటా ఖరీఫ్ చివరి పంట, రబీ సీజన్‌లో మొదటి పంటగా జొన్న సాగవుతోంది. ఈ ఏడాది జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 10 వేలు, రబీలో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం కాగా విత్తనానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఆయా మండలాల్లో ఖరీఫ్ సాగుకు ఈనెలాఖరు నుంచి అదునుకాగా రబీ సీజన్‌లో అక్టోబర్ నెలాఖరు వరకు గడువు ఉండటంతో మహేంద్ర, హైబ్రిడ్, పచ్చ జొన్న, తదితర రకాల సాగుపై రైతులు దృష్టి సారించారు. గత ఏడాది జొన్నసాగు రైతులకు కలిసిరాలేదు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధరతో రైతులు గట్టెక్కారు.

గణనీయంగా పెరగనున్న సాగు విస్తీర్ణం

జిల్లాలోని ఆయా మండలాల్లో జొన్న సాగుకు వర్షాలు అనుకూలిస్తుండటంతో రైతులు జొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో ఆరు వ్యవసాయ సబ్ డివిజన్లు ఉండగా ఈ ఏడాది ఖరీఫ్‌లో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 166 హెక్టార్లు, సంజామల మండలంలో 741 హెక్టార్లు, కొలిమిగుండ్ల మండలంలో 266 హెక్టార్లు, ఉయ్యాలవాడ మండలంలో 79 హెక్టార్లు, దొర్నిపాడు మండలంలో 47 హెక్టార్లు, అవుకు మండలంలో 25 హెక్టార్లతోపాటు బనగానపల్లె మండలంలో 382, చాగలమర్రి మండలంలో 431, ఆళ్లగడ్డ మండలంలో 135 హెక్టార్లలో సాగు లక్ష్యం. వాతావరణం అనుకూలంగా మారటంతో ఆయా మండలాల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే ఆస్కారం ఉన్నట్లు వ్యవసాయధికారులు పేర్కొంటున్నారు. జొన్న సాగుకు విత్తనాలు, రసాయన ఎరువుల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు.

తగ్గిన పప్పుధాన్యాల సాగు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పప్పుధాన్యాల పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. సీజన్ మొదట్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మినుము, కంది, పెసర పంటలను రైతులు సాగు చేయలేకపోయారు. గత నెలలో వర్షాలు కురిసినా అప్పటికే ఆ విస్తీర్ణంలో మొక్కజొన్న, చిరుధాన్యాలు సాగు చేయడంతో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది జొన్న సాగుతో రైతులు నష్టాలు చవి చూశారు. మహేంద్ర, హైబ్రిడ్ రకాల సాగులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సాగునీరు మళ్లింపు, కోత, నూర్పిడి తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.25 వేలు వెచ్చించారు. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే లభించాయి. మార్కెట్‌లో క్వింటా రూ.2 వేల నుంచి రూ.2,500 ధర పలకడంతో దిగుబడులు తగ్గినా గిట్టుబాటు ధరతో నష్టాల ఊబి నుంచి బయట పడ్డారు. పచ్చజొన్నలో ఎకరాకు 3–5 క్వింటాళ్లు వచ్చాయి. క్వింటా రూ.5,400 వరకు ధర పలికింది. గతేడాది జొన్న సాగుతో నష్టపోయిన రైతులు ఆ నష్టాన్ని అదే పంట ద్వారా రాబట్టాలన్న ఉద్దేశంతో ఖరీఫ్, రబీ సీజన్లలో లక్ష్యానికి మించి జొన్న సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దుక్కిదున్ని రసాయన ఎరువులు విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు.



కోవెలకుంట్ల సమీపంలో జొన్న సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతు

రెండు ఎకరాల్లో జొన్న సాగు చేస్తా



గత ఏడాది రెండు ఎకరాల్లో జొన్న సాగు చేశాను. రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చయ్యింది. వర్షాలు కురవకపోవడంతో ఎకరాకు 10 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాకపోవడంతో నష్టాలు చవి చూడాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా రెండు ఎకరాల్లో జొన్న సాగుకు సిద్ధమవుతున్నాను.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీపై జొన్న విత్తనాలు, రసాయన ఎరువులు సరఫరా చేయాలి. మూడు ఎకరాల విస్తీర్ణంలో జొన్న సాగుకు పొలాన్ని దుక్కిదున్ని సాగుకు సన్నద్ధమయ్యాను. విత్తనానికి ముందే వర్షాలు అనుకూలంగా మారటంతో ఈ ఏడాది జొన్న సాగు అన్ని విధాలా కలిసి వస్తుందని భావిస్తున్నాను.

– కామేశ్వరరెడ్డి, రైతు, కోవెలకుంట్ల

క్లుప్తంగా

బదిలీలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్: 75 ప్రకారం పంచాయతీ రాజ్ శాఖలో సిబ్బంది, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు డీపీఓ టి.నాగరాజునాయుడు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బంది, ప్రత్యేక పరిస్థితులు ఉన్న ఉద్యోగులు బదిలీలకు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న వారు ఎంపీడీఓ ఈ మెయిల్ ద్వారా డీపీఓ కార్యాలయానికి దరఖాస్తులను పంపాలన్నారు. అలాగే నేరుగా కూడా వచ్చి అందించవచ్చన్నారు. అలాగే రెండు జిల్లాల వారు పరస్పరం జిల్లా మారాలనుకుంటే రెండు జిల్లాల డీపీఓ కార్యాలయాల్లో దరఖాస్తు ప్రతులను సమర్పించాలన్నారు.

తుంగభద్రలో పెరిగిన వరద నీరు

కర్నూలు సిటీ: జిల్లాలోని పశ్చిమ, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం తుంగభద్ర నదికి వరద నీటి ప్రవాహం పెరిగింది. ఉదయం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి(సుంకేసుల బ్యారేజీ)బ్యారేజీకి 59,801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సాయంత్రం ఆరు గంటలకు 95,097 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న నీటిలో 21 గేట్ల ద్వారా దిగువకు 92,652, కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పగిడ్యాల: చెడు వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం పగిడ్యాల జిన్నుకాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన మోషే(33)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారున్ని ప్రసవించి మృతి చెందగా రెండో వివాహం చేసుకున్నట్లు కాలనీవాసులు తెలిపారు. చెడు సావాసం పట్టి తాగుడుకు బానిస కావడం వల్ల నాలుగేళ్ల క్రితం రెండవ భార్య మల్లేశ్వరి కూడా పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముచ్చుమర్రి పోలీసులు మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుని తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన జేసీ



తెర్నేకల్ సమీపంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జేసీ నవ్య

దేవనకొండ: భారీ వర్షాలకు మండలంలోని హంద్రీవాగు పరివాహక ప్రాంతాలైన అలారుదిన్నె, పొట్లపాడు, తెర్నేకల్, బెల్లందొడ్డి తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల పంట పొలాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో నష్టపోయిన పంటలను పరిశీలించడానికి జేసీ బి.నవ్య బుధవారం తెర్నేకల్ గ్రామంలో పర్యటించారు. జరిగిన నష్టంపై రైతులతో మాట్లాడారు. నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని, అలాగే ప్రతి రైతును ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జేసీ వెంట సర్పంచ్ అరుణ్ కుమార్, దేవనకొండ తహసీల్దార్ జయన్న, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హరిత వనాలు.. పాణ్యం నర్సరీలు

- బాటసారులను ఆకట్టుకుంటున్న మొక్కలు

పాణ్యం: జిల్లాలోనే నర్సీలకు పాణ్యం పెట్టింది పేరు. ఇక్కడ దాదాపు 100 ఎకరాలపైగా 600 రకాల మొక్కలను నర్సరీ యజమానులు పెంచుతున్నారు. ఇక్కడ లభించే మామిడి మొక్కలకు భలే డిమాండ్ ఉంది. రైతులే స్వతహాగా మామిడి మొక్కలను తల్లి చెట్టుకు అంటు కట్టడంతో ఆరోగ్యకరంగా పెరగడంతోపాటు తెగుళ్లను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటోంది. ఇతర జిల్లాల నుంచి కూడా రైతులు మొక్కల కోసం ఆరు నెలల ముందుగానే ఆర్డర్ చేసి కొనుగోలు చేస్తున్నారంటే వీటికి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతోంది. ఇక అలంకార, ఆకర్షణీయ మొక్కలు కూడా ఎక్కువే. హైవే పక్కనే నర్సరీలు ఉండటంతో బాటసారులను, వాహనదారులను రకరకాల పూల మొక్కలు ఆకర్షిస్తున్నాయి. వాహనాలను కాసేపు ఆపి నర్సరీల్లో సేద తీరి మొక్కలు కొనుగోలు చేసి వెళ్తా ఉంటారని నిర్వాహకులు చెబుతున్నారు.




పోయిన్‌సెటియా

పింక్ కలర్‌లో పూలు ఎంత అందంగా అనిపిస్తున్నాయి కదూ.. కానీ అవి పూలు కాదు. ఆకులే. పామ్‌సీటీ అనే ఈ మొక్కకు కొన్ని ఆకులు గ్రీన్ కలర్‌లో ఉండగా, మరికొన్ని పింక్ కలర్‌లో కనులకు ఇంపుగా కనిపిస్తున్నాయి. వీటిని ఎక్కువ మంది అలంకరణకు తీసుకెళ్తుంటారని నిర్వాహకులు తెలిపారు.



స్టార్‌ఫ్రూట్స్

ఈ పండ్లు తిపి, వగరు, పులుపు ఉంటాయి. షుగర్, గ్యాస్ట్రబుల్ ఉన్న వాళ్లకు స్టార్‌ఫ్రూట్స్ చాలా మంచింది. ఇవి అరుదుగా లభిస్తాయి.



బొగన్‌విలియా

ఈ చెట్టు రంగులు రంగుల్లో ఉంటుంది. 6–7 అడుగుల వరకు పెరు గుతుంది. దీని విలువ అక్షరాల రూ.23 వేలు. సాధారణంగా గ్రామాల్లో కా గితాల పూలు అంటారు. ఇదే కోవకు చెందిన ఈ మొక్క పుట్టుకతోనే డిజైన్‌లతో పెరుగుతుంది.



ఇన్సులిన్ మొక్క

పేరులోనే ఇన్సులిన్ ఉంది. షుగర్ ఉన్న వారు ఈ మొక్క ఆకులు, మరిఒక ఆకు మొక్కను కలిపి తీసు కుంటే ఎంతటి షుగర్ అయినా నియంత్రణలోకి వస్తుంది.



యూఫోర్బియా

ఈ మొక్కలు అతి చిన్నవిగా కుండీలోనే బతుకుతాయి. తెల్లటి రంగులో ఉంటాయి. ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఈ మొక్కలు ఇంట్లో అలంకరణకు ఎంతో బాగుంటాయి.



అరెలియస్‌బాల్

ఈ మొక్కలకు పూలు, కాయలు కాయవు. కేవలం ఆకులు మాత్రమే ఉంటాయి. ఈ ఆకులే పూల లాగా ఉంటాయి. ఈ మొక్కలు కూడా అంత ఎత్తు ఏమీ పెరగవు. అతి చిన్నవిగా ఉంటాయి.



బబ్బురి పనాసా

ఈ మొక్కకు కాసే కాయలు బత్తాయి పండు కంటే లావు ఉంటాయి. ఒక్కొక్కటి కనీసం కిలోన్నర బరువు ఉంటాయి. కాయ రుచి ఒగరుగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎంతో మంచిది.

అన్ని రకాల మొక్కలున్నాయి

మా వద్ద అన్ని రకాల మొక్కలున్నాయి. రూ.20 నుంచి రూ.8 వేల విలువ చేసే మొక్కలున్నాయి. ప్రజలు ఎక్కువగా ఇళ్లకు అందాన్నిచ్చే మొక్కలను ఇష్టపడుతన్నారు. ఇక మామిడి మొక్కలు కావాలనుకునే రైతులు ముందుగానే ఆర్డర్ ఇస్తుంటారు. ఇన్ని మొక్కలు కావాలంటే అన్ని మొక్కలు అంటుకట్టి అందిస్తాం.

– నడిపెన్న, నర్సరీ యజమాని

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రాజశేఖర్

పత్తికొండ(ఆళ్లగడ్డ): ప్రేమ విఫలమైందనే మనస్థాపంతో ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పత్తికొండ మండలం పులికొండలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన చందోలి సోమరాజు కుమారుడు రాజశేఖర్ (29) అదే గ్రామానికి చెందిన ఓ యువతి గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. పెళ్లి కూడా చేసుకోవాలని భావించినా యువతి కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఇదే సమయంలో ఆమెకు పెళ్లి సంబంధం కూడా చూశారు. అయినప్పటికీ రాజశేఖర్ ఆమెకు ఫోన్ చేస్తూ ఒత్తిడి చేసినా ఆమె తన కుటుంబ సభ్యులను ఎదిరించలేనని చెప్పింది. దీంతో మనస్థాపం చెందిన యువకుడు ఈ నెల 19న గ్రామ శివారులోని వ్యవసాయ పొలం దగ్గర సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగు మందు తాగి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న రాజశేఖర్‌ను కర్నూలు వైద్యశాలకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. యువతి కుటుంబ సభ్యులు బెదిరించడంతోనే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని తండ్రి సోమరాజు ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ హేమ్లానాయక్ తెలిపారు.

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని ఎస్పీ జి.బిందుమాధవ్‌తో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టాలన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచాలని, కొన్ని చోట్ల గంజాయిని అంతర పంట సాగుచేస్తుంటారని, అటవీ, వ్యవసాయ శాఖాధికారులు గమనిస్తూ ఉండాలన్నారు. తెలిస్తే వంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. అదే విధంగా జిల్లా సరిహద్దుల్లో తిరిగే బస్సులు,బస్టాండ్‌లలో నిఘా ఉంచాలన్నారు.కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు ప్రత్యేక సదస్సుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 23 న ప్రతి గ్రామంలో గ్రామసభలు జరుగుతాయని, అందులో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డిఅడిక్షన్ సెంటర్‌లో ఎంతమంది చికిత్స తీసుకుంటున్నారనే వివరాలను కలెక్టర్ డీఎంహెచ్‌ఓను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ..33 ప్రభుత్వ, 44 ప్రైవేట్ కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహించినట్లు చెప్పారు. పలు పట్టణాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, అటవీ శాఖాధికారి శ్యామల, మునిసిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, డీటీసీ శ్రీధర్, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ, ఔషధ నియంత్రణ ఏడీ రమాదేవి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ భాస్కర్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

వెల్దుర్తి: ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్యాధికారులకు సూచించారు. వెల్దుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూరిబా విద్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరాతీశారు. నెలకొన్న సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. పది, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈయన వెంట అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఈఓ శ్యాముల్, డీసీహెచ్ఎస్ డా. మాధవి, పీడియాట్రిక్ బాలచంద్రారెడ్డి ఉన్నారు.



పేషెంట్ కేస్‌షీట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆస్తి విషయంలోనే హత్య



ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని రూరల్: మండలపరిధిలోని పెద్దహరివాణం గ్రామంలో మూడురోజుల క్రితం జరిగిన ఉప్పర శేఖన్న హత్య కేసును పోలీసులు ఛేదించారు. మొదటి భార్యనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. డీఎస్పీ సోమన్న బుధవారం ఇస్వీ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. హతుడు ఉప్పర శేఖన్నకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య జయమ్మకు సంతానం కలగకపోవడంతో గంగమ్మ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఇద్దరు పిల్లలు. అయితే, ఇటీవల ఆస్తి పంపకాల విషయంలో మొదటి భార్య జయమ్మ, భర్త శేఖన్న మధ్య వివాదం మొదలైంది. రెండో భార్య పిల్లలకు మాత్రమే ఆస్తులు రాసిస్తానని భర్త చెప్పడంతో తన పరిస్థితి ఏమిటని ఆమె నిలదీసింది. సమాధానం చెప్పకపోవడంతో ఈనెల 18వ తేది అర్ధరాత్రి ఇంటి బయట అరుగుపై కూర్చున్న భర్తతో మరోసారి గొడవ పడింది. ఈక్రమంలోనే కొడవలితో శేఖన్న గొంతు కోసి చంపానని నిందితురాలు జయమ్మ అంగీకరించి'నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ మర్డర్ కేసులో ఇంకా ఎవరైనా హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు సాగుతున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

- భారత్‌బంద్‌ను కావాలనే బాబు అణదివేశారు
- మాల సంఘాల జేఏసీ చైర్మన్ యాట ఓబులేష్



సీ క్యాంపు సెంటర్‌లో రాస్తారోకో చేపట్టిన మాల సంఘాల జేఏసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): భారత్‌బంద్‌ను కావాలనే అణచివేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుతామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ యాట ఓబులేష్ హెచ్చరించారు. బుధవారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ భారత్ బంద్‌లో భాగంగా మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సీ క్యాంపులో ఉదయం 10.30 గంటల సమయంలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మాల సంఘాల నాయకులు నినాదాలు చేశారు. వర్గీకరణ పేరుతో రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ..సీఎం చంద్రబాబునాయుడు తమ సంఘాల నాయకులను రాత్రికిరాత్రే పోలీసులతో హౌస్ అరెస్టు చేయించారని ఆరోపించారు. ఎస్సీ కులాల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టారని ఆరోపించారు. ఎస్సీలో అతి పెద్ద ఉప కులమైన మాలలను అణచి వేసేందుకే కుట్ర జరుగుతుందన్నారు. దమ్ముంటే మాలల ఓట్లు తమకు అవసరం లేదని చెప్పాలని చంద్రబాబుకు సవాల్ విసిరారు. నిజంగా ఎస్సీలపై ప్రేమ ఉంటే ఎస్సీ జనాభా లెక్కలు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో మాలల సత్తా ఏమిటో చంద్రబాబునాయుడుకు చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సోగరాజు మునయ్య, సుధీర్, మాధసు నాగరాజు, దామోదరం రాధాకృష్ణ, వేల్పుల విజయ్, ఏసేపు, బరిగేలా నాగరాజు, మాధవస్వామి, రంగస్వామి, మునిస్వామి, సర్పంచ్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మరో మూడు నెలల్లో జీడీపీ అభివృద్ధి పనులు పూర్తి

- ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి



జీడీపీలో నీటి నిలువను పరిశీలిస్తున్న ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) ఆనకట్ట ఎత్తు, గేట్ల మరమ్మతులకు సంబంధించి పనులను మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన ఈఈ శైలేశ్వర్‌తో కలిసి ప్రాజెక్టును, పనులను పరిశీలించారు. ప్రాజెక్టుకు ఉన్న ఆరు గేట్లలో ఐదు గేట్లను కొత్తగా తయారు చేశారు. అందులో రెండు గేట్లను ట్రైల్ రన్ నిర్వహించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ జీడీపీ ఆనకట్ట ఎత్తు పెంచేందుకు, గేట్ల పనులకు గతంలో రూ.57 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికీ దాదాపు 90 శాతం పనులు పూర్తి అయ్యాయని మిగతా 10 శాతం పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఎగువ ప్రాంతాలకు చెందిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రాజెక్టుకు వరద నీరు ఎంత వచ్చినప్పటికీ 4.5 టీఎంసీల నీటిని మాత్రమే నిలువ చేస్తామని మిగతా నీటిని హంద్రీకి విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ విజయ్ కుమార్, ఏఈ మహమ్మద్ ఆలీ, ఉగ్రనరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే వినతిపత్రాలు కాదు పార్థసారథి!

ప్రజలు ప్రశ్నిస్తారని తెరపైకి అనవసర విషయాలు

- ప్రభుత్వ స్థలం కానప్పుడు రాద్ధాంతం ఎందుకు?
- మూడు నెలలైనా ఒక్క గుంత పూడ్చలేకపోయారు
- మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడంతోనే సరి
- కేంద్రం నుంచి తెస్తానన్న రూ.500 కోట్లు ఎక్కడ
- విమర్శలు మాని ప్రజలకు ఇచ్చిన హామీ నిలుపుకో
- మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్: ''కేంద్రం నుంచి రూ.500 కోట్ల నిధులు తెచ్చి ఆదోని ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైంది. కేవలం మంత్రులకు వినతిపత్రాలు ఇస్తే అభివృద్ధి జరిగిపోతుందా? ప్రతీసారి విజయవాడ, కేంద్రం వద్దకు వెళ్లి వినతిపత్రాలు ఇవ్వడం వరకే మీ పనితీరు ఆగిపోయింది. పోరాడితే తప్ప అభివృద్ధి జరగదని తెలుసుకో'' అని ఎమ్మెల్యే పార్థసారథిపై మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం నిర్మించిన స్థలం ఏపీ ఎన్జీఓస్‌కు చెందినదని, ఆ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకోవడంతో రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడి తమకు లీజుకు ఇచ్చారన్నారు. అంతేకానీ అది కబ్జా చేసిన స్థలం కాదు, ప్రభుత్వ ఆస్తి కాదు.. అక్రమ కట్టడం అంతకన్నా కాదనే విషయం పార్థసారథి తెలుసుకుంటే మంచిదన్నారు. ఈ విషయాన్ని ఇదివరకే స్థానిక ఎన్జీఓ నేతలు స్వయంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరించారన్నారు. అయినప్పటికీ అన్యాయంగా, అక్రమంగా దోచుకున్నట్లు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం ఎమ్మెల్యేకు తగదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు పట్టణంలో ఒక్క గుంతను కూడా పూడ్చలేకపోయారన్నారు. ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని లేనిపోని ఆరోపణలతో కాలం వెల్లదీస్తున్నారన్నారు. అభివృద్ధి విషయంలో పోటీ పడితే తాము కూడా సహకరిస్తామని, అంతేకానీ ఇలాంటి అనవసర రాద్ధాంతం చేస్తే ఊరుకోబోమన్నారు.

కించ పరిచే మాటలు మాట్లాడొద్దు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ టీ అమ్మేవారు, సినీ నటుడు రజనీకాంత్ బస్ కండక్టర్, ధీరూబాయ్ అంబానీ పెట్రోల్ బంకులో పనిచేసేవారు.. వారంతా ఎలా ఎదిగారో తెలుసుకోవాలని.. అంతేగానీ ఎర్రిస్వామి సినిమాలో టికెట్‌లు ఇచ్చేవాడని, ఇప్పుడు ఎలా ఎదిగాడని కించపరిచేలా మాట్లాడవద్దన్నారు. ఆయనను తన బినామీగా పేర్కొనడం పార్థసారథి నీచ రాజకీయానికి నిదర్శనమన్నారు. మీరు కూడా 30:30:40 అనే విషయం ప్రజలకు అర్థమైపోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అందరినీ సమానంగా చూస్తామని చెప్పి వాటాలను కూడా అదే తరహాలో పంచుకుంటున్నారని విమర్శించారు.

డబ్బుంటే నేనే అభివృద్ధి చేసేవాడిని

నాకు డబ్బుపై ఆశ లేదు. రోజు లక్షల్లో ఆదాయం వస్తుందని అంటున్నావు.. అంత డబ్బే ఉంటే ఆదోని పట్టణాన్ని తానే అభివృద్ధి చేసేవాడినని మాజీ ఎమ్మెల్యే సాయి అన్నారు. ముందుచూపుతో ఆదోని ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచించాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, రామలింగయాదవ్, దేవా, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆశలు నీటిపాలు

- జిల్లాలో 5,262.59 హెక్టార్లలో పంట నష్టం



హాలహర్వి సమీపంలో నష్టపోయిన పత్తి పంట

కర్నూలు(అగ్రికల్చర్): అధిక వర్షాలు రైతుల ఆశలను నీటిపాలు చేశాయి. జిల్లాలో 11 మండలాల, 58 గ్రామాలపై వర్షాల ప్రభావం ఉంది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని 11 మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా చిప్పగిరిలో 75.8 మి.మీ, అత్యల్పంగా సీ.బెళగల్‌లో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా 131.1 మి.మీ వర్షం కురిసింది. హాలహర్వి, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి, కౌతాలం, కోసిగి, మంత్రాలయం, పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, మద్దికెర మండలాల్లోని 58 గ్రామాల్లో అధిక వర్షాలు పంటలను దెబ్బతీశాయి. రెండు రోజులుగా కురిసిన భారీ నుంచి అతి భారీ వర్షాల వల్ల 5,262.59 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి.

- వ్యవసాయ శాఖకు సంబంధించి 4,307.69 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వేరుశనగ 2777.40 హెక్టార్లు, వరి 550, పత్తి 237, కంది 640.29, ఆముదం 18, సజ్జ 78, కొర్ర 5, ప్రొద్దుతిరుగుడు 2 హెక్టార్ల ప్రకారం దెబ్బతిన్నాయి.
- ఉద్యానశాఖకు సంబంధించి 558.9 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. మిర్చి, ఉల్లి సోయాబీన్, సపోట, బీర తదితర పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 695 మంది రైతులు నష్టపోయారు.
- బుధవారం అర్ధరాత్రి నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా వాన కురిసింది. కర్నూలు నగరంలో ఉరుములు,మెరుపులతో భారీ వర్షం కురిసింది.

జీరో వ్యాపారానికి తావివ్వొద్దు



మార్కెట్ కమిటీ సెక్రటరీతో మాట్లాడుతున్న డైరెక్టర్

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్ కమిటీల్లో జీరో వ్యాపారానికి తావు ఉండరాదని, ఎవరైనా రైతులను దగా చేసి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మార్కెట్ యార్డుల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులతో చర్చించారు. ఆదోని, ఎమ్మిగనూరుల్లో అసంపూర్తిగా ఉండిపోయిన జంబో షెడ్‌లను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేస్తామన్నారు. ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో ఉన్న కూరగాయల మార్కెట్‌ను బయటికి తరలించాలని రైతులు, కమీషన్ ఏజెంట్లు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డును కలియ తిరిగి తూకాలు సక్రమంగా ఉంటున్నాయా.. ఇతరత్రా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగారు. తర్వాత మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమై యార్డుల్లో రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలన్నారు. లక్ష్యాలను 100 శాతం సాధించడంపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు మార్కెట్ కమిటీ వారీగా వచ్చిన ఆదాయం వివరాలను సమీక్షించారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ... మార్కెట్ కమిటీల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. మార్కెట్ యార్డులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కార్మికులు డైరెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు పాల్గొన్నారు.